సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 22 । జనవరి । 2024



కీడు సోకిందని వనవాసం

కీడు సోకిందని నిడమనూరు మండలం పార్వతీపురం గ్రామస్తులంతా ఆదివారం ఊరు విడిచి వనవాసం వెళ్లారు. - 8లో



గోవా టు మిర్యాలగూడ

కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి గోవాలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి మిర్యాలగూడకు తరలిస్తున్నారు. - 8లో



'మునుగోడు'కు గోదావరి...

మునుగోడు నియోజకవర్గానికి గోదావరి జలాలు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. - 10లో

న్యూస్‌రీల్

'ఆర్టీఐ యాక్ట్‌ను పాఠ్యాంశంలో చేర్చాలి'

భువనగిరిటౌన్ : అవినీతిరహిత సమాజం, పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం కోసం సమాచార హక్కు చట్టాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షుడు కొడారి వెంకటేష్ కోరారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం–2005పై జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో 4,8,10 తరగతుల్లో సమాచార హక్కు చట్టం–2005 పాఠ్యాంశంగా ఉండగా గత ప్రభుత్వం తొలగించిందన్నారు. రాష్ట్ర కమిషనర్లను పూర్తిస్థాయిలో నియమించక చట్టాన్ని నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం తిరిగి సమాచార హక్కు చట్టాన్ని విద్యార్థులకు పాఠ్యాంశంగా చేర్చాలని, జోనల్ వారీగా సమాచార కమిషనర్లను నియమించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే చట్టంపై అవగాహన ఉంటే భవిష్యత్‌లో అవినీతి రహిత, ఉత్తమ సమాజం ఏర్పాటుకు అవకాశం ఉంటుందన్నారు.

ఆత్మకూర్(ఎం) కవులకు పురస్కారాలు



పురస్కారాలతో నగేష్, బీసు చందర్‌గౌడ్, దామోదర్‌రెడ్డి

ఆత్మకూరు(ఎం) : సేవా రంగంలో ప్రతిభ కనబరిచిన ఆత్మకూరు(ఎం)కు చెందిన సర్పంచ్ జన్నాయికోడె నగేష్, నాటక రంగంలో మాజీ సర్పంచ్ బీసుచందర్‌గౌడ్, పైళ్ల దామోదర్‌రెడ్డి పుడమి సాహితీ వేదిక విశిష్ట సేవా పురస్కారాలు దక్కాయి. ఆదివారం నల్లగొండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతుల మీదుగా విశిష్ట కళారత్న అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యాస లక్ష్మారెడ్డి, నేతాజీ యువజన మండలి మాజీ అధ్యక్షుడు పోతగాని మల్లేశం గౌడ్, గ్రామస్తులు రాచమల్ల సత్తయ్య, మాద రవి, ఎలగందుల విజయ్ పాల్గొన్నారు.

వేతనం పెంచాలని మెప్మా ఆర్పీల వినతి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న మెప్మా ఆర్పీలు

భువనగిరిటౌన్ : వీఎల్ఆర్, స్త్రీనిధి నిధుల నుంచి ఆర్పీలకు గౌరవ వేతనం ఇవ్వాలనే నిబంధనలు తొలగించి ప్రభుత్వమే నేరుగా చెల్లించాలని మెప్మా ఆర్పీలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కోరారు. ఆదివారం భువనగిరిలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం నెలకు రూ.4వేలు మాత్రమే వస్తున్నాయని, రూ.18 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ రెండు నెలల్లో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆర్పీలు సునీత, సమ్మక్క, వాణి, రమ, వందన, భాగ్య, నవనీత ఉన్నారు.

ఉద్యమకారుల పాత్ర మరువలేనిది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

వలిగొండ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంలో మలిదశ తెలంగాణ ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. వలిగొండలోని శివసాయి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మలిదశ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు ఉద్యమకారులు తెలంగాణ ఉద్యమస్ఫూర్తితో పని చేశారని కొనియాడారు. ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు సంగిశెట్టి క్రిష్టఫర్, ఎంపీపీ నూతి రమేష్, జెడ్పీటీసీ వాకిటి పద్మాదేవేందర్‌రెడ్డి, సర్పంచ్ బోళ్ల లలితాశ్రీనివాస్, జ్యోతిరెడ్డి, గుండేటి ఐలయ్య పాల్గొన్నారు.

● అంతా రామమయం



విద్యుత్ దీపాల వెలుగుల్లో భువనగిరిలోని రామాలయం



భూదాన్‌పోచంపల్లిలో కాషాయ జెండాలతో అలంకరణ

సాగునీటికి ప్రాధాన్యం

పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం ● రైతులకు నష్టం కలగకుండా పరిహారం

- యాదాద్రిలో మెరుగైన వసతులు కల్పిస్తాం
- భువనగిరి ఖిలాను టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతాం
- రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- జిల్లా అభివృద్ధి, పెండింగ్ పనులపై అధికారులతో సమీక్ష
- ప్రతిపాదనలు తయారు చేయాలని ఆదేశం



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ జెండగే, అదనపు కలెక్టర్లు

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వం సాగునీటికి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తుందని, జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, అందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె.జెండగేతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్మారెడ్డి, పిలాయిపల్లి, బునాదిగాని కాలువలు ఆధునీకరణ పనులు అసంపూర్తిగా ఉన్నందున ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి పూర్తి చేస్తామన్నారు.బస్వాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న గ్రామాల పునరావాసం కోసం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇస్తామన్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలో 18 ఏళ్ల వయస్సు దాటిన వారిని కూడా చేర్చాలని ఇప్పటికే అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. సాగునీటి కాలువలు, ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోతునన రైతులు ఆందోళన చెందవద్దని, అన్ని విధాలా న్యాయం చేస్తామన్నారు. గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణానికి కూడా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో భక్తు రద్దీకి అనుగుణంగా వసతులు కల్పిస్తామని, త్వరలో దేవాదాయ శాఖ మంత్రితో కలిసి సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎయిమ్స్‌లో చేపట్టిన రెండు టవర్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, వసతులను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. భువనగిరి ఖిలా అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరయ్యాయని, రెండు నెలల్లో రోప్‌వే పనులు పూర్తి చేసి టూరిజం స్పాట్‌గా తీర్చిదిద్దుతామని తెలిపారు. రాయగిరి వద్ద పది ఎకరాల విస్తీర్ణంలో రూ.33.50కోట్లతో చేపట్టనున్న మల్టీపర్పస్ స్టేడియం నిర్మాణానికి నాలుగైదు రోజుల్లో డీపీఆర్ పంపాలని అధికారులను ఆదేశించారు. భువనగిరి మున్సిపాలిటీలో పూర్తిస్థాయిలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మిస్తామన్నారు.

వంతెనల నిర్మాణానికి నిధులు

భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో వంతెనల నిర్మాణానికి రూ.60 కోట్ల చొప్పున ఆర్అండ్‌బీ శాఖ నుంచి కేటాయించామని మంత్రి తెలిపారు. రుద్రవెల్లి, సంగెం వద్ద మూసీ బ్రిడ్జీలు, బొల్లేపల్లి, అనాజీపురం రోడ్లు మంజూరయ్యాయని వెల్లడించారు. కొలనుపాకలో రూ.15 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం, జైన దేవాలయం వరకు రోడ్డును విస్తరించడంతో పాటు వీధి లైట్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 24న బ్రిడ్జి పనులకు శంకుస్థాపన చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు భాస్కర్‌రావు, వీరారెడ్డి, అడిషనల్ డీసీపీ శివరాంరెడ్డి, ఆర్డీఓ అమరేందర్, ఉమ్మడి జిల్లా జెడ్పీ మాజీ చైర్మన్ కసిరెడ్డి నారాయణరెడ్డి, రోడ్లు,భవనాలు, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం

మంత్రి ఆయన తరువాత తొలిసారిగా కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కలెక్టర్ హనుమంతు కె. జెండగే పూల మొక్క ఇచ్చి ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, వీరారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మంత్రికి పూలమొక్కలు అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, అదనపు కలెక్టర్లు

మంత్రి దృష్టికి సమస్యలు

ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. యాదగిరిగుట్ట పట్టణంలో ప్రజలకు ఇబ్బందిగా మారిన బ్రిడ్జిని తొలగించాలని, ఆటోలను కొండపైకి అనుమతించాలని, కొండపైన భక్తులు బస చేయడానికి డార్మిటరీ హాల్ నిర్మించాలని అయిలయ్య కోరారు. అలాగే గంధమల్ల రిజర్వాయర్, బునాదిగాని కాలువలను పూర్తి చేయాలని విన్నవించారు. కొండపోచమ్మ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఇచ్చిన విధంగా బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులకు కూడా ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని, రూ.200 కోట్లు విడుదల చేయాలని కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి మంత్రికి విన్నవించారు. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని కోరారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



ఓటరు నమోదు వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఆలేరురూరల్ : అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ హనుమంత్ కె.జండగే కోరారు. ప్రత్యేక ఓటరు నమోదులో భాగంగా ఆలేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటరు నమోదుపై ఆరా తీశారు. వలస వెళ్లిన, చిరునామా మారిన, మృతి చెందిన ఓటర్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు ఉన్నారు.

బకాయిదారులకు రెడ్ నోటీసులు

- భువనగిరి మున్సిపాలిటీలో వంద శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యం
- ప్రత్యేక కార్యాచరణ రూపొందించిన అధికారులు



రెడ్ నోటీసు జారీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

భువనగిరిటౌన్ : వంద శాతం ఆస్తిపన్ను వసూలే లక్ష్యంగా భువనగిరి మున్సిపల్ యంత్రాంగం ముందుకెళ్తోంది. ఆర్థిక సంవత్సరం ముగింపునకు సమయం ఆసన్నమవుతున్నందున వంద శాతం పన్ను రాబట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. పెద్దమొత్తంలో బకాయి ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు.

భువనగిరి మున్సిపాలిటీలో ఇలా..	
ఆస్తిపన్ను డిమాండ్	వసూలు చేసింది
రూ.748.36 లక్షలు	రూ.287.34 లక్షలు
బకాయి రూ.461.02 లక్షలు	

బకాయిదారుల జాబితా సిద్ధం

మొండి బకాయిదారుల వివరాల జాబితా అధికారులు సిద్ధం చేశారు. నివాస, వాణిజ్య సముదాయాలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన బకాయిలు ఉన్నాయి. మొదటి విడతలో ప్రభుత్వ శాఖలకు లేఖలు రాయడం, మున్సిపాలిటీ పరిధిలో టాప్ 100 అత్యధిక ఆస్తి పన్ను బకాయి ఉన్న యాజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. 15 రోజుల్లోగా స్పందించని యాజమానుల ఆస్తులను స్వాధీనం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ప్రత్యేక బృందాలు

పన్నులు వసూలు చేయడానికి బిల్ కలెక్టర్లతో పాటు ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందానికి ప్రత్యేకాధికారులను నియమించారు. భువనగిరి మున్సిపాలిటీలో 35 వార్డులు ఉండగా నివాస గృహాలు, వ్యాపార వాణిజ్య సముదాయలు కలిపి 14,650 ఉన్నాయి. మొండి బకాయిదారులు ఆస్తి పన్ను చెల్లించాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొంటున్నారు. మార్చి 31వ తేదీ లోగా ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఆస్తిపన్ను చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నోటీసులు జారీ చేస్తున్నాం

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేసేలా తగిన ప్రణాళికలు రూపొందించాం. ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్ను వసూలు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొండి బకాయిదారుల జాబితా రూపొందించి నోటీసులు జారీ చేస్తున్నాం. మార్చి నెలాఖరు వరకు వంద శాతం పన్నులు వసూలు చేస్తాం. ఆస్తి పన్ను దారులు అపరాధ రుసుము లేకుండా సకాలంలో పన్ను చెల్లించి పట్టణాభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– నాగిరెడ్డి, కమిషనర్ భువనగిరి మున్సిపాలిటీ

జాతీయ రహదారిపై కొనసాగుతున్న రద్దీ



చౌటుప్పల్‌లో హైదరాబాద్ వైపు బారులుదీరిన వాహనాలు

చౌటుప్పల్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ ఆదివారం కూడా కొనసాగింది. సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వచ్చిన ప్రజలు తిరుగు ప్రయాణం కావడం, దీనికి తోడు వీకెండ్ కూడా తోడవడంతో హైదరాబాద్ మార్గంలో వాహనాలు బారులుదీరాయి. వాహనాల రద్దీ కారణంగా చౌటుప్పల్ పట్టణ పరిధిలో ప్రజలు అవస్థలు పడ్డారు. వారాంతపు సంత ఉండడంతో రోడ్డు దాటే క్రమంలో ఇబ్బందులకు గురయ్యారు. మండల పరిధిలోని పంతంగి టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా నిర్వాహకులు చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్ మార్గంలో 10 టోల్‌బూత్‌ల నుంచి వాహనాలను పంపిస్తున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే 15 నుంచి 20వేల వరకు వాహనాలు అదనంగా వెళ్లాయి.

నారసింహుడికి పుష్పార్చన





యాదాద్రి ఆలయ వీధుల్లో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) స్వామివారికి పుష్పార్చన చేస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా ఆచార్యులు లక్ష పుష్పార్చన నిర్వహించారు. వేదమంత్రాలతో శ్రీస్వామివారిని కొలుస్తూ లక్ష పుష్పాలతో ఆరాధించారు. అనంతరం స్వామి, అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో తీర్చిదిద్ది అష్టోత్తర పూజలు చేశారు. అదే విధంగా వేకువజామున సుప్రభాత సేవ, నిజాభిషేకం, అనంతరం శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడుసేవోత్సవం తదితర వేడుకలు నిర్వహించారు. భక్తులు మొక్కులు తీర్చుకొని స్వామివారి ఆశీస్సులు పొందారు.

నకిలీ విత్తనాలు విక్రయించారని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతు వెంకటేష్

మోటకొండూర్ : నకిలీ విత్తనాలు అంటగట్టి మోసం చేశారంటూ మోటకొండూర్ మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన శివరాత్రి వెంకటేష్ దుకాణం ఎదుట ఆదివారం ఆందోళనకు దిగాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రైతు వెంకటేష్ నాలుగు నెలల క్రితం మోటకొండూరులోని ఫామ్ హబ్‌లో రాధిక హైబ్రీడ్ విత్తన కంపెనీకి చెందిన బెండ విత్తనాలు కిలో రూ.7,200 చొప్పున నాలుగు కిలోలు కొనుగోలు చేశాడు. పంటకాలం ముగుస్తున్నా సరిగా పూత, కాత రావడం లేదు. ఇప్పటి వరకు క్వింటా కాత కూడా వెళ్లలేదు. ఈ విషయాన్ని బాధిత రైతు నాలుగు సార్లు దుకాణ నిర్వాహకుడి దృష్టికి తీసుకెళ్లాడు. దీంతో సదరు కంపెనీ ప్రతినిధులు వచ్చి తోటను పరిశీలించారు. వారి సూచనలు పాటించినా ఫలితం కనిపించలేదు. యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పిస్తామని కంపెనీ ప్రతినిధులు కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆరోపించారు. నష్టాన్ని ఇప్పించాలని కోరుతూ దుకాణం ఎదుట విత్తనాల ప్యాకెట్‌తో రైతు ఆందోళనకు దిగాడు. దుకాణ యజమాని, కంపెనీపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి నష్టపరిహారం ఇప్పిస్తామని తెలిపారు.

మూడేళ్లుగా అడుగు పడలే..

- భూచంపల్లిలో కలగానే సమీకృత మార్కెట్
- స్థలం ఖరారులో తీవ్ర జాప్యం
- రోడ్ల పక్కనే వ్యాపారాలు
- సౌకర్యాలు లేక ఇబ్బందులు



మార్కెట్ నిర్మాణానికి ప్రతిపాదించిన ఆర్టీసీ బస్టాండ్ స్థలం

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో మంజూరైన సమీకృత మార్కెట్ కలగానే మిగిలిపోయింది. మూడేళ్లు గడుస్తున్నా పనులు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నాయి. టెండర్లు పూర్తయినప్పటికీ అందుబాటులో ప్రభుత్వ స్థలం లేకపోవడం వల్ల పనుల్లో జాప్యం జరుగుతోంది.

స్థలం విషయంలోనే..

2021లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీకి సమీకృత మార్కెట్‌ను మంజూరు చేసింది. నిర్మాణ పనులకోసం రూ.2 కోట్లు కేటాయించింది. అయితే ఆదినుంచి స్థలం విషయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొదట పట్టణంలోని బీసీ కాలనీలో గల ఖాళీ స్థలంలో మార్కెట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అయితే స్థానికుల నుంచి అభ్యంతరాలు రావడంతో అధికారులు వెనక్కి తగ్గారు. ఆ తరువాత పద్రె కాలువ సమీపంలో దేవాదాయ శాఖకు చెందిన 1002, 1003 సర్వే నంబర్లలో గల రెండు ఎకరాల భూమిని గుర్తించి కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించారు. కానీ, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిరాకరించడం మళ్లీ మొదటికొచ్చింది. ఇటీవల నిరుపయోగంగా ఉన్న రెండు ఎకరాల ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని ప్రతిపాదించి కౌన్సిల్ తీర్మానం చేసింది. మొదట్లో స్థలం ఇవ్వడానికి సంబంధిత అధికారులు సుముఖత చూపలేదు. చివరకు కలెక్టర్ ఆదేశాల మేరకు బస్టాండ్ స్థలానికి బదులుగా జలాల్‌పురం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 80లో గల 2 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆర్టీసీకి కేటాయించారు. కానీ, అది కూడా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు.

రోడ్డు పక్కన అమ్ముతున్నాం



పోచంపల్లిలో ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. ఐదేళ్లుగా ఇక్కడి వచ్చి కూరగాయలు అమ్ముతున్నా. మార్కెట్‌లేక రోడ్డుపై పెట్టి కూరగాయల వ్యాపారం చేస్తున్నా. కరెంట్ లేక రాత్రివేళలో ఇబ్బంది ఉంటుంది. ఛార్జింగ్‌లైట్ల వెలుగులో విక్రయిస్తున్నాం. మార్కెట్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– యాదమ్మ, చిరువ్యాపారి, రాయపోలు, రంగారెడ్డి జిల్లా

త్వరలో పనులు ప్రారంభిస్తాం



స్థలం లేకపోవడంతో మార్కెట్ పనుల్లో జాప్యం జరుగుతుంది. ఇటీవల ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని ప్రతిపాదించాం. ఈ స్థలానికి బదులు ఆర్టీసీకి జలాల్‌పురం పరిధిలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. ప్రస్తుతం మున్సిపాలిటీలో నిధుల కొరత ఉంది. దాతలను కూడా సంప్రదిస్తున్నాం.త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– నర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, భూదాన్‌పోచంపల్లి

వ్యాపారులు, వినియోగదారులకు ఇబ్బందులు

పట్టణంలోని చేనేత డై హౌజ్ సమీపంలో చిరువ్యాపారులు రోడ్లపైనే విక్రయాలు చేస్తున్నారు. ప్రతి ఆదివారం సంత జరుగుతుంది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం, మంచాల, దండుమైలారం, మల్కాపూర్, రాపోలు, భూదాన్‌పోచంపల్లి మండలం దోతిగూడెం, భీమనపల్లి, రేవనపల్లి, శివారెడ్డిగూడెం తదితర ప్రాంతాల నుంచి 200మంది వరకు రైతులు, చిరువ్యాపారులు ఇక్కడికి కూరగాయలు, ఆకుకూరలు, ఇతర నిత్యావసర సరుకులను తెచ్చి విక్రయిస్తున్నారు. ఇక్కడ సౌకర్యాలు, రాత్రివేళ విద్యుత్ దీపాలు లేక, వర్షాకాలంలో తల దాచుకోవడానికి షెడ్‌లు లేక వ్యాపారులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

క్లుప్తంగా

సీఎం సలహాదారు ఉరుమడ్ల అల్లుడే


నరేందర్‌రెడ్డి

చిట్యాల: సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అత్తగారి ఊరు చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామం. ఉరుమడ్ల గ్రామానికి చెందిన గుత్తా మధుసూదన్‌రెడ్డి కూతురు విజయలక్ష్మిని ఆయన వివాహం చేసుకున్నారు. ఆయన తరచూ ఇక్కడ జరిగే శుభ కార్యాలకు హాజరయ్యే వారు. సీఎం సలహాదారుడిగా నియామకం కావటంతో ఆయన దగ్గరి బంధువు కాంగ్రెస్ పార్టీ చిట్యాల మండల మాజీ అధ్యక్షుడు గుత్తా వెంకట్రాంరెడ్డితో పాటు ఆ గ్రామస్తులు, పలువురు పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బంగారు గొలుసు అపహరణ

రామగిరి(నల్లగొండ): గుర్తుతెలియని వ్యక్తులు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును అపహరించారు. ఈ సంఘటన ఆదివారం తిప్పర్తి మండలం పెద్దసూరారంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్ద సూరారం గ్రామానికి చెందిన కొమ్మగోని సుశీల ఆదివారం వ్యవసాయ పనులు ముగించుకుని మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళ్తోంది. ఈ క్రమంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 3 తులాల బంగారు గొలుసును లాక్కొని పజ్జూరు వైపు పరారయ్యారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ధర్మ తెలిపారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

చౌటుప్పల్ : రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్–విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై పంతంగి శివారులో ఆరెగూడెం స్టేజీ వద్ద ఆదివారం రాత్రి ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో 60–70 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వృద్ధుడు గాయపడ్డాడు. అతడిని పోలీసులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించామని సీఐ దేవేందర్ తెలిపారు.

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్ల ఎంపిక

భువనగిరి : ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఖోఖో సీనియర్ పురుషులు, మహిళా జట్ల ఎంపిక పోటీలు ఆదివారం భువనగిరిలోని ఇండోర్ స్టేడియం ఆవరణలో నిర్వహించారు. ఈ పోటీల్లో 120 మంది పాల్గొనగా పురుషులు 20, మహిళలు 20 మందిని ఎంపికయ్యారు. వీరికి ఈనెల 25నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన ఆయా కేటగిరీల్లోని 15 మంది చొప్పున ఫిబ్రవరిలో భువనగిరిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనున్నారు. ఈ సందర్భంగా ఖోఖో ఉమ్మడి నల్లగొండ జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఎంపికైన జట్లకు శిక్షణ ఇస్తామని, రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలని కోరారు. ఫిబ్రవరి 5 నుంచి 11వ తేదీ వరకు భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 56వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.రమేష్‌రెడ్డి, కోశాధికారి ఏ.విజయ్, జాయింట్ సెక్రటరీ కె.మురళీ, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అంజనేయులు, శ్రీశైలం, బాలకృష్ణ, సురేందర్, స్వాతి, పీఈటీలు కేశ నాగులు, నాగేంద్ర, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది
గుంటిపల్లి బాల్‌కుమార్ అనునేను యాదగిరి గుట్ట నుండి రాజాపేటకు బస్సులో ప్రయాణం చేస్తుండగా నాయొక్క ఓపెన్ ప్లాట్ ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది. డాక్యుమెంట్ నెం. (25883-2021) దయచేసి దొరికినవారు
సంప్ర॥ 9398003283

గోవా టు మిర్యాలగూడ

- మళ్లీ దిగుమతి అవుతున్న మద్యం
- బెల్టు దుకాణాల్లో యథేచ్ఛగా విక్రయాలు
- ఇటీవల గోవా మద్యం విక్రయిస్తున్న బెల్టు దుకాణం నిర్వాహకుడి అరెస్ట్
- అధికారుల అండదండలతోనే వ్యాపారం సాగుతోందని ఆరోపణలు


మిర్యాలగూడలో ఇటీవల పట్టుకున్న గోవా మద్యం, నిందితుడు శివతో ఎక్సైజ్ పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడలో గోవా మద్యం వ్యాపారం జోరుగా సాగుతోందని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు అక్రమార్కులు ముఠాగా ఏర్పడి గోవాలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి అడ్డదారుల్లో మిర్యాలగూడకు రవాణా చేస్తున్నారని తెలిసింది. అలా తీసుకువచ్చిన మద్యాన్ని బెల్టు దుకాణాల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని తెలుస్తోంది. కొందరు అక్రమార్కులు ఒక అడుగు ముందుకేసి గోవా మద్యాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా రవాణా చేస్తున్నారని సమాచారం. అక్రమార్కులకు అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతోనే దందాను అడ్డూ అదుపు లేకుండా నిర్వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల గోవా మద్యం విక్రయిస్తూ ఓ బెల్టు దుకాణం నిర్వాహకుడు ఎక్సైజ్ పోలీసులకు చిక్కడంతో అక్రమ వ్యాపారం వెలుగులోకి వచ్చింది.

బెల్టు దుకాణాల్లోనే అధికంగా మద్యం విక్రయాలు

మద్యం వ్యాపారులు వ్యాపార విస్తరణలో భాగంగా తమ దుకాణాల పరిధిలో విచ్చల విడిగా బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయించారని విమర్శలు ఉన్నాయి. అయితే, బెల్టు దుకాణాల నిర్వాహకులు ఆయా వైన్స్‌ల మద్యంతో పాటు గోవా మద్యాన్ని విక్రయిస్తున్నారని తెలిసింది. ఇలా అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్టు దుకాణాల్లోనే సుమారు 60శాతం మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని సమాచారం. అమ్మకాలను నివారించాల్సిన సంబంధిత శాఖ అధికారులు నెలవారీ మామూళ్లకు అలవాటు పడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. బెల్టు దుకాణాల నిర్వాహకులపై కేసులు నమోదు కాకుండా మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ఎక్సైజ్ అధికారులకు ముడుపులు ముట్టజెపుతున్నారని సమాచారం.

ఇతర రాష్ట్రాల మద్యం విక్రయిస్తే చర్యలు

ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తెచ్చి స్థానికంగా విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమ మద్యంపై ప్రభుత్వం కూడా సీరియస్‌గా ఉంది. ఇరత రాష్ట్రం నుంచి మద్యం తేవడంతో మన రాష్ట్రం ఆదాయం కోల్పోయే అవకాశం ఉంది. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం బెల్టు షాపులు లేవు. ఎక్కడైనా బెల్టు షాపులతో ఇబ్బందులు వస్తున్నాయని మా దృష్టికి తీసుకొస్తే తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం.
– మహేశ్వర్‌రెడ్డి, ఎక్సైజ్ సీఐ, మిర్యాలగూడ

ఆదాయానికి గండి

అధికారుల కళ్లుగప్పి తీసుకువచ్చిన గోవా మద్యాన్ని అక్రమార్కులు స్థానికంగా బెల్టు షాపుల ద్వారా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతోంది. ఇదిలా ఉంటే అక్రమార్కులు విక్రయిస్తున్న మద్యం నకిలీదనే అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

ఏడాది క్రితం ఆంధ్రాకు రవాణా చేస్తూ..

మిర్యాలగూడ పట్టణంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన ఓ బెల్టు దుకాణం నిర్వాహకుడు గోవా నుంచి లారీల్లో తెచ్చిన సుమారు 600 మద్యం పెట్టెలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తరలిస్తుండగా గుంటూరు జిల్లాకు చెందిన ప్రత్యేక పోలీసులు పట్టుకున్నారు. మిర్యాలగూడకు చెందిన బెల్టు దుకాణం నిర్వాహకుడు భారీగా మద్యం తరలించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. ఎక్సైజ్ పోలీసుల అండదండలతోనే మద్యం సరిహద్దు దాటిందని ఆరోపణలు వచ్చాయి.

తాజాగా..

మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్‌కు చెందిన పున్న శివ, రాకేశ్ నిర్వహిస్తున్న బెల్టు దుకాణంలో 45 బాటిళ్ల గోవా మద్యాన్ని నాలుగు రోజుల క్రితం ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. శివను అదుపులోకి తీసుకోగా రాకేశ్ పరారీలో ఉన్నాడు. వీరికి గోవా మద్యం ఎవరు సరఫరా చేశారని పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు.

విద్యుదాఘాతంతో బైక్ మెకానిక్ మృతి


అల్లి రవి (ఫైల్)

మద్దిరాల : విద్యుదాఘాతంతో బైక్ మెకానిక్ మృతిచెందాడు. మద్దిరాల మండల కేంద్రంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దిరాల మండల పరిధిలోని చందుపట్ల గ్రామానికి చెందిన అల్లి మల్లయ్య–రేణుక దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు రవి(20) చదువుమానేసి మండల కేంద్రంలో బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రోజు మాదిరిగానే ఓ బైక్‌కు వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. గమనించిన చుట్టు పక్కల వారు విద్యుత్ సరఫరా నిలిపివేసి రవిని సూర్యాపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. హైటెన్షన్‌లో విద్యుత్ సరఫరా కావడంతోనే ప్రమాదం జరిగిందని మృతుడి బంధువులు ఆరోపించారు. చేతికి అందివచ్చిన కుమారుడు విద్యుదాఘాతంతో మృతిచెందడంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. రవి మృతితో అతడి స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

మోత్కూరు : ఇంటి ఆరుబయట కూర్చొని ఉన్న ముగ్గురు మహిళలపైకి కారు దూసుకెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదివారం మోత్కూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మోత్కూరు పట్టణానికి చెందిన నగరకంటి గీత, బాలెంల యాదమ్మ, సుక్క రిషిలు తమ ఇంటి ఆవరణలో కూర్చొని ఉన్నారు. ఇదే సమయంలో మోత్కూరు పట్టణానికి చెందిన మెంట చందు పూటుగా మద్యం తాగి కారు డ్రైవింగ్ చేసుకుంటూ వచ్చాడు. ఈ క్రమంలో కారు అదుపుతప్పి ఆరుబయట కూర్చున్న మహిళలపైకి దూసుకురావడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీ


నార్కట్‌పల్లిలోని భగవాన్‌శర్మ ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

నార్కట్‌పల్లి : గుర్తుతెలియని వ్యక్తులు పట్టపగలే తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. నార్కట్‌పల్లిలో ఆదివారం వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని శివాలయం పూజారి భగవాన్‌శర్మ కుటుంబ సభ్యులు శనివారం ఇంటికి తాళం వేసి శ్రీశైలం పుణ్య క్షేత్రానికి వెళ్లారు. గమనించిన గుర్తుతెలియని వ్యక్తులు భగవాన్‌శర్మ ఇంటి తాళం పగులగొట్టి లోనికి చొరబడ్డారు. వస్తువులను చిందరవందరగా చేసి అందినకాడికి అపహరించుకుపోయారు. సాయంత్రం భగవాన్‌శర్మ పని మనిషి ఇంటికి వచ్చి చూసి యజమానికి సమాచారం ఇచ్చింది. దీంతో భగవాన్‌శర్మ కుటుంబ సభ్యులు పుణ్య క్షేత్రానికి వెళ్లకుండానే అదే రోజు రాత్రి ఇంటికి తిరిగి వచ్చారు. దుండగులు బీరువాలో దాచిన రూ.1.70లక్షలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. ఆదివారం పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

పుడమి సాహితీ సేవలు అభినందనీయం


శ్యాంసుందర్‌రెడ్డిని సన్మానిస్తున్న లక్ష్మీపార్వతి



కేశవులు, అంజనేయులుకు అవార్డు అందజేస్తున్న ఏపీ తెలుగు అకాడమీ చైర్మన్ లక్ష్మీపార్వతి

రామగిరి(నల్లగొండ): పుడమి సాహితీ సేవలు అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమీ చైర్మన్ నందమూరి లక్ష్మీపార్వతి అన్నారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం పుడమి సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పుడమి సాహితీ వేదిక 5వ వార్షికోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఐదు సంవత్సరాలుగా 200 మందికి పురస్కారాలు అందించడం గొప్ప విషయమని, తెలుగు సాహిత్యాన్ని ఎప్పుడూ మర్చిపోలేమన్నారు. తెలుగు భాషను భారతదేశంలోనే రెండో జాతీయ భాషాగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుత్తా మోహన్ రెడ్డి, గాౖరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, కాసాల నర్సిరెడ్డి, కర్నె శిరీష (అలియాస్ బ్రైలక్క), యం.డి. మునీర్ అహమ్మద్ షరీఫ్ , ఇటిక్యాల జగన్ మోహన్ రెడ్డి ,గార్లపాటి ఉమాకర్ రెడ్డి, పర్వతి సత్యనారాయణ, అప్పినపల్లి భాస్కరాచారి, గాయం నారాయణ రెడ్డి, వాకిటి రాంరెడ్డి, పెరుక రాజు , ఎజ్జు మల్లయ్య, మాగంటి ప్రసాద్, చల మల హైమావతి పాల్గొన్నారు.

పుడమి విద్యారత్న పురస్కారం ప్రదానం

చిట్యాల: చిట్యాల పట్టణానికి చెందిన తెలుగు భాషోపాధ్యాయుడు కాసుల అంజనేయులు పుడమి విద్యారత్న పురస్కారానికి ఎంపికయ్యారు. పుడమి సాహితి వేదిక ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నల్ల గొండలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు ఏపీ తెలుగు అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీ పార్వతి అవార్డు అందజేశారు. అంజనేయులుకు పురస్కారం రావటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

కీడు సోకిందని పార్వతీపురం వాసుల వనవాసం


పార్వతీపురంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


నిల్వచేసిన నీటిని పారబోస్తున్న గ్రామస్తులు

నిడమనూరు: కీడు సోకిందని నిడమనూరు మండలం పార్వతీపురం గ్రామస్తులు ఆదివారం ఊరు విడిచి వనవాసానికి వెళ్లారు. తెల్లవారుజామునే తమ వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి భోజనాలు ఆరగించి సాయంత్రం ఇళ్లకు చేరుకున్నారు. అయితే, గ్రామ దేవలకు పూజలు, జీవాలను బలి ఇవ్వాలనే పట్టింపు లేకుండానే వనభోజనాల కార్యక్రమం నిర్వహించుకున్నారు.

జ్వరాలు వస్తున్నాయని..

గ్రామంలోని పలువురికి ఇటీవల వరుసగా జ్వరాలు రావడం, ఒకరిద్దరికి డెంగీ లక్షణాలు కన్పించడంతో భయాందోళన చెందారు. ఒకరి తర్వాత మరొకరు అస్వస్థతకు గురవుతుండడం, శ్రావణ మాసంలో ఊరంతా వనవాసానికి వెళ్లకపోవడంతో ఇలా జరుగుతుందని గ్రామస్తులు భావించి వనవాసానికి వెళ్లినట్లు తెలిసింది. విషయం తెలుసుకుని నిడమనూరు పీహెచ్‌సీ వైద్యులు పార్వతీపురంలో ఐదు రోజులుగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఇదిలా ఉంటే గ్రామంలో అపరిశుభ్ర వాతావరణమే జ్వరాలకు కారణమని వైద్యులు పేర్కొంటున్నారు. గ్రామంలో అక్కడక్కడ నిల్వ ఉన్న మురుగునీటిని తొలగింపజేయించి, జాగ్రత్తలు పాటించాలని సూచించామని వైద్యులు తెలిపారు.

హెల్త్ క్యాంప్ ఏర్పాటు

పార్వతీపురంలో ఐదు రోజుల నుంచి హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నాం. కొంత మందికి వైరల్ ఫీవర్ లక్షణాలు ఉన్నాయి. పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేశాము. పదిహేను రోజుల క్రితం ఒకరికి డెంగీ లక్షణాలు కన్పించాయి. తర్వాత తగ్గిపోయింది. గ్రామస్తులకు పలు జాగ్రత్తలు, సూచనలు చేశాము.
– డా. మాదవ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు, నిడమనూరు

భువనగిరిలో కాంగ్రెస్ కార్యకర్తల వాగ్వాదం

- మంత్రి కోమటిరెడ్డిని సన్మానించే విషయంలోనే గొడవ


భువనగిరిలో వాగ్వాదం చేసుకుంటున్న కాంగ్రెస్ శ్రేణులు

భువనగిరిటౌన్ : భువనగిరిలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సన్మానించే విషయంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులు, సమస్యలపై చర్చించేందుకు ఆదివారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భువనగిరికి చేరుకున్నారు. ఈ క్రమంలో ఆయనకు స్వాగతం పలికి సన్మానించేందుకు కాంగ్రెస్ కార్యకర్తలు పోటీపడ్డారు. ఇదే సమయంలో ఆ పార్టీ నాయకుడు మహ్మద్ నజీర్ మంత్రిని శాలువాతో సత్కరించేందుకు వచ్చాడు. అక్కడ అదే పార్టీకి చెందిన నాయకుడు పోతంశెట్టి వెంకటేశ్వర్లు అడ్డుగా నిలబడి ఉన్నాడు. అడ్డు జరిగితే మంత్రిని సన్మానించి వెళ్లిపోతామని నజీర్ కోరగా మీరు ఎవరు అంటూ వెంకటేశ్వర్లు అనడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వాదం జరిగింది. పక్కన ఉన్న కొందరు నాయకులు వారిని వారించడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షకు విలేకరులకు అనుమతి ఇవ్వకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు.

సరోజినీ దేవికి నివాళి

ప్రముఖ పారిశ్రామిక వేత్త గంపా నాగేంద్ర తల్లి సరోజినీదేవి ఇంటీవల మృతిచెందారు. ఈ మేరకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనల్‌కుమార్‌రెడ్డితో కలిసి భువనగిరి పట్టణంలో వారి ఇంటికి వెళ్లి ఆమె చిత్రపటాకి పూలమాల వేసి నివాళులర్పించారు.వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

400 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీదే గెలుపు



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు

నల్లగొండ టూటౌన్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో దేశంలోని 400 స్థానాల్లో బీజేపీ పార్టీ గెలిచి కేంద్రంలో వరసగా మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని బీజేపీ రాష్ట ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోగా హామీలు అమలు చేస్తామన్న కాంగ్రెస్ పెద్దలు ఆరు గ్యారంటీలపై ఇప్పటి వరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన నాగం వర్షిత్‌రెడ్డికి రాష్ట్ర పార్టీ నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని అన్నారు. అనంతరం నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. నల్లగొండ పార్లమెంట్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ఆలస్యం చేస్తే ప్రజల పక్షాన పోరాడుతామని తెలిపారు. సమావేశంలో పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు నూకల నరసింహారెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, బండారు ప్రసాద్, పోతెపాక సాంబయ్య, దాయం భూపాల్‌రెడ్డి, కంకణాల నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి వివాదాస్పద స్థలం నిరాకరణ

నార్కట్‌పల్లి : అయోధ్యలో సోమవారం శ్రీరామ మందిరం ప్రారంభం సందర్భంగా నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన కొందరు అన్నదానం చేయాలని నిర్ణయించుకున్నారు. అందుకు నిర్వాహకులు ఎంపిక చేసుకున్న మండల కేంద్రంలోని అంగడి స్థలాన్ని పోలీసులు నిరాకరించారు. ఆదివారం అన్నదానానికి అనుకులంగా ఉన్న అంగడి(కూరగాయలు విక్రయించే) స్థలంలో అన్నదానం చేసేందుకు స్థానిక ప్రజలు, యువకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు అన్నదానానికి జరుగుతున్న ఏర్పాట్లను అడ్డుకున్నారు. నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐలు రాఘవరావు, మహేష్, ఆదిరెడ్డి మరికొందరు పోలీసులు అన్నదాన నిర్వాహకులతో గంటకుపైగా చర్చలు జరిపారు. ఈ స్థలం కోర్టు వివాదంలో ఉందని, అన్నదానం సమీప ఆలయంలో నిర్వహించుకోవాలని సూచించారు. వీరి వెంట నార్కట్‌పల్లి తహసీల్దారు పద్మ తదితరులున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

- **Plot for Sale 165 Sq.Yds** West Face in CSR Developer Venture, beside New Vivera Hotel, Yadadri Dist. bypass Road. Cont: 8885556861. [W-788982]
- 800 గజాలు (120x60) ఫీట్ల ఈస్ట్ ఫేస్ 30 ఫీట్ల రోడ్ సూర్యనగర్ కాలనీ, నల్లగొండ పబ్లిక్ స్కూల్ దగ్గర, నల్లగొండ నందు గల ప్లాటు అమ్మకమునకు కలదు. గజం 17,900/- సంప్ర॥ 9888808442, 6303025110 [Y-798411]

Wanted

- హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ : 18K. Ph: 9640258899, 9640468899 [H-793680]
- Hydలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ లేడీ గార్డ్స్, ఫీల్డ్ ఆఫీసర్స్, కావలెను. ఏరియా: బాలానగర్, మియాపూర్, జీడిమెట్ల, గండిమైసమ్మ కొల్లూరు రూం ఫ్రీ మెట్రోమేనేజ్‌మెంట్ ఫోన్: 9963077722/ 9885657755 [H-801465]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా యాడ్స్ పంపిస్తూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 7702518530, 8019341329. [M-1233755]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233752]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఇటు ఉద్యోగం.. అటు పట్టు పురుగుల పెంపకం..


పట్టుపురుగులు పెంచుతున్న రైతు కర్ణాకర్


జాల గ్రామంలో పెంచుతున్న పట్టుపురుగులు


సాగవుతున్న మల్బరీ తోట

- లాభాలు గడిస్తున్న యువరైతు
- వరి సాగు కంటే పట్టు పురుగుల పెంపకమే మేలంటున్న ఏబీపీఎం

రాజాపేట : ఆ యువకుడు ఉన్నత విద్య అభ్యసించాడు.. ప్రభుత్వ కొలువు కూడా సాధించాడు. ఓ వైపు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే మరో వైపు పట్టు పురుగుల పెంపకం చేపట్టి లాభాలు గడిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం కొత్త జాల గ్రామానికి చెందిన బొమ్మకంటి కర్ణాకర్. కొత్తజాల గ్రామానికి చెందిన బొమ్మకంటి మల్లయ్య, ఎల్లమ్మ దంపతుల పెద్ద కుమారుడు కర్ణాకర్ ఎంబీఏ పూర్తి చేశాడు. తపాలా శాఖలో రఘునాథపురం ఏబీపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు.

వరి సాగు వద్దని..

కర్ణాకర్ కుటుంబానికి ఏళ్లుగా వ్యవసాయమే జీవనాధారం. వరి సాగు చేస్తే ఆశించిన మేర దిగుబడులు రావడం లేదని కర్ణాకర్ పట్టుపురుగుల పెంపకం చేపట్టాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలోనే 2019వ సంవతరంలో తమకున్న రెండు ఎకరాల్లో మల్బరి తోట సాగు చేశాడు. వ్యవసాయ అధికారుల సహకారంతో రూ. 5లక్షలతో పట్టుపురుగుల పెంపకానికి ఓ షెడ్డు నిర్మాణం చేశాడు. ఇందుకు ప్రభుత్వం నుంచి అప్పుడు రూ.60వేల రుణం లభించింది. అప్పటి నుంచి నేటికి ఏడాదికి 6 పంటలు తీస్తూ లాభాలు గడిస్తున్నాడు. వరి సాగు కంటే పట్టుపురుగుల పెంపకమే లాభదాయకంగా ఉందని పేర్కొంటున్నాడు.

పట్టు పురుగుల పెంపకం ఇలా..

పట్టుపురుగుల పెంపకానికి బొమ్మకంటి కర్ణాకర్ ఓ రేకుల షద్దుతోపాటు రెండు ఎకరాల పొలంలో డ్రిప్ సహాయంతో మల్బరీ తోట సాగు చేస్తున్నాడు. సిద్దిపేటలోని పట్టుపరిశ్రమ శాఖ అధికారులకు రూ.1000 డీడీ రూపంలో చెల్లిస్తే (బీవీ) బై ఓల్టెన్ బ్రీడ్ ఎగ్స్ 90వేలు వస్తాయని, వాటిని షెడ్డులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న టేబుల్స్‌పై పరుచుకుని పొదిగేలా చూసుకోవాలి. గుడ్డు దశ నుంచి పురుగు దశకు వచ్చే సరికి మూడు రోజులు ట్రేలల్లో పెట్టుకోవాలి. అనంతరం గాలిలో 30శాతం లోపు ఉష్ణోగ్రత ఉండే షడ్డులో మంచాల మాదిరిగా ఉన్న (ఘాట్)లపై పురుగులను వేసుకుని వాటికి మల్బరీ ఆకులను ముక్కలు ముక్కలుగా కత్తిరించుకుని ఆహారంగా వేసుకోవాలి. పురుగులు పెరిగే కొద్ది మల్బరీ కొమ్మలను వాటిపై పరుచుకోవాలి. ఇలా రోజుకు రెండు పర్యాయాలు పాత కొమ్మలు తీయ్యకుండా వాటిపై కొత్త కొమ్మలు వేస్తుంటే పురుగులు ఆకులను పూర్తిగా తింటూ పెద్దవిగా మారుతాయి. పురుగులకు నాలుగు స్టేజీల్లో ఫీవర్ వస్తుందని నివారణకు విజేత పౌడర్, సున్నం చల్లుకోవాలని తెలిపాడు. 40రోజులకు పురుగులు గూళ్ల కట్టిన తరువాత వాటిని తీసివేసి ఎండిపోయిన కొమ్మలను వాటి విసర్జన పూర్తిగా తొలగించేందుకు 10రోజుల కాలం పూర్తి అవుతుందని, అనంతరం మరో పంట సాగు ఇదే విధంగా చేసుకోవాలని తెలిపాడు.

ఖర్చులు.. లాభాలు

పట్టుపురుగుల పెంపకానికి 90వేల గుడ్లకు రూ. 2వేలు, రవాణా చార్జీలు రూ. వెయ్యి అవుతుంది. ఇలా 90 వేల పురుగులు 40రోజులకు పెరిగి గూళ్లుగా మారి ఒక్క గ్రాము సైజులో పట్టుదారం వస్తుంది. పట్టు గూళ్లను సమీపంలోని జనగాం మార్కెట్‌లో విక్రయిస్తే రవాణా చార్జీలు రూ.1500 వస్తుంది. ఇలా 90 వేల పురుగులకు గూళ్లకు 90కేజీల పట్టుగూళ్లు వస్తే కేజీకీ రూ. 350 నుంచి 500 వరకు నాణ్యతను బట్టి ధర వస్తుంది. ఇలా కేజీ చొప్పున రూ.400 అనుకుంటే 90 కేజీలకు రూ. 36వేలు ఆదాయం వస్తుంది. ప్రతీ పంటకు రూ. 16వేల ఖర్చులు పోను 50 రోజుల పంటకు రూ. 20వేలు లాభంగా వస్తాయని తెలిపాడు. యేడాదికి 6 పంటల పేరిట రూ.1.20లక్షల లాభం వస్తుందని వివరించాడు.

లాభసాటిగా ఉంది



గతంలో ఎంతో కష్టపడి రెండు ఎకరాలు వరిసాగు చేస్తే ఏడాదికి రూ. 20వేలు మాత్రమే లాభం వచ్చేది. ఆదే రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేసి పట్టుపురుగుల పెంపకాన్ని చేపడితే 50 రోజులకు ఒక్క పంట చొప్పున 6 పంటలకు రూ. 1.20లక్షల లాభం వస్తుంది. అంతే కాకుండా మిగిలిపోయిన మల్లబరీ తోట పశువులకు దాణాగా పాడి పరిశ్రమకు ఉపయోగపడుతుంది.
– బొమ్మకంటి కర్ణాకర్, కొత్తజాల గ్రామం